క్లుప్తంగా

ఉత్సాహంగా చదరంగం పోటీలు


పోటీల్లో విజేతలైన బాల, బాలికలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జశ్వర్ పాఠశాలలో అండర్–11 బాల, బాలికల చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలుర విభాగంలో రియాన్, సుజిత్, తరంగ్ విజయం సాధించగా, బాలికల విభాగంలో నేహశ్రీ, అధ్య, అక్షయ గెలుపొందారు. విజేతలు ఈ నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్–11 పోటీల్లో పాల్గొంటారని సంఘ కార్యదర్శి వి.కుమార్ తెలిపారు.

వెండి గరగల వితరణ

కడియం: వేమగిరి గ్రామ దేవతలుగా భక్తులు కొలిచే కొండాలమ్మ, ముత్యాలమ్మ వార్లకు రూ.2.26 లక్షల విలువైన రెండు వెండి గరగలను ఆదివారం దాతలు బహూకరించారు. అర్చకుడు కొత్తూరి సతీష్ ఆధ్వర్యంలో ఆయన బావ హరిహర సోమయాజుల సుబ్రహ్మణ్యం దంపతులు ఈ వెండి గరగలను సమకూర్చారు.

కోవెలకు శలాక విద్వత్ సమర్చన పురస్కారం

సీటీఆర్ఐ: మహా మహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత శలాక రఘునాథ శర్మ ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా అందజేసే శలాక విద్వత్ సమర్చన పురస్కారాన్ని ఈఏడు ప్రాచార్య కోవెల సుప్రసన్నాచార్యులు అందుకోనున్నారు. భాషా సాహిత్యాలకు విశేష సేవలు అందించిన వారికి 2016 నుంచి శలాక ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. బోధన, పరిశోధన, కవిత్వ రచన, తాత్త్విక విమర్శ తదితర రంగాలలో కోవెల సుప్రసన్నాచార్యులు విశేష కృషి చేస్తున్నారు. సుమారు 90 ఏళ్ల ప్రాయంలో ఇటీవల ఆయన రచించిన 'రామకథాసుధ', 'శ్రీకృష్ణ శ్శరణం మమ' గ్రంథాలు విద్వాంసుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ పురస్కారం కింద రూ.35 వేల నగదు, నూతన వస్త్రాలతో సత్కరించనున్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని కోవెల సుప్రసన్నాచార్యుల ఇంటి వద్ద శలాక ఈ పురస్కారాన్ని అందజేస్తారు.

రైతులకు తక్షణ సాయం ప్రకటించాలి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాల కారణంగా నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం ప్రకటించాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వరద బాధితులను పునరావాస శిబిరాలకు తరలించాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైలు, రోడ్డు మార్గాలకు ఆటంకం ఏర్పడిన చోట ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీ కాన్ఫరెన్సులతో సరిపెట్టకుండా తక్షణమే ఏరియల్ సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. ఆర్థిక విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వ సాయం కోరాలని సూచించారు. రైతులు మరింత నష్టపోకుండా ఉచితంగా విత్తనాలు అందజేయాలన్నారు. అధికారులను అప్రమత్తం చేసి ప్రజాప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను స్వీయ పర్యవేక్షణ చేయాలన్నారు.

గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతులు

కడియం: మండలంలో పనిచేస్తున్న ఆరుగురికి గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గ్రేడ్–3 కార్యదర్శులు ఆర్.వెంకటలక్ష్మి(వీరవరం), బి.సరోజారాణి (మురమండ), కె.విజయరాజు (కడియపు సావరం)కు గ్రేడ్–2 పదోన్నతి లభించింది. ఈ ముగ్గురిని తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించారు. అలాగే మరో ముగ్గురు పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లకు కూడా గ్రేడ్ –2 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. వారిలో పీఎస్ఆర్ మూర్తి (కడియం), పి.సాయిరామ్ (జేగురుపాడు), కె విజయలక్ష్మి(దుళ్ల) ఉన్నారు. వీరిలో విజయలక్ష్మిని తూర్పుగోదావరి జిల్లాకు కేటాయించగా, మిగిలిన ఇద్దరినీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక

ప్రకాశం నగర్: అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎఎస్) రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక మావో భవన్‌లో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా టి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా యు.గన్నిరాజు, ఉపాధ్యక్షులుగా ఉదలయ్య, సత్తెన్న, పోలమ్మ, కూర్మారావు, కోశాధికారిగా వి.చంటిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ జాతీయ అధ్యక్షురాలు టాన్యా, జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ గోయల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విప్లవ రైతు కూలీ ఉద్యమాలను, ప్రతిఘటన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పంటల గిట్టుబాటు ధర కోసం, భూమి కోసం ఉద్యమించాలన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా 22 డిమాండ్లతో తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు.

సర్కారు జాగా.. మర్చారు ఖాళీగా..

- కార్పొరేషన్ స్థలాలకు రక్షణ కరవు
- ఫెన్సింగ్‌కు చొరవ చూపని అధికారులు
- కబ్జాకు గురవుతాయని సర్వత్రా ఆందోళన
- దాతల ఆశయాలను గౌరవించాలంటున్న ప్రజలు


కృష్ణానగర్‌లో పిచ్చి మొక్కలతో నిండి ఉన్న కార్పొరేషన్ స్థలం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నగరపాలక సంస్థ యంత్రాంగానికి కరవైంది. నగరపాలక సంస్థ పరిధిలో అనేక ప్రాంతాలలో సంస్థకు చెందిన కోట్లాది రూపాయల విలువైన స్థలాలున్నాయి. కొన్ని ప్రాంతాల్లోనే ఖాళీగా ఉన్న స్థలాలకు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ అధికారులకు ఉన్నప్పటికీ, వాటి రక్షణకు చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజమహేంద్రవరం నగరంలో 38వ డివిజన్ కృష్ణానగర్‌లో మార్కెట్ ధర మేరకు రూ.కోటి విలువైన 200 గజాల స్థలాన్ని దాతలు నగరపాలక సంస్థకు దానం చేశారు. ప్రజోపయోగ కార్యక్రమాలను వినియోగించాలనే ఉద్దేశంతో ఈ స్థలాన్ని అప్పగించారు. స్థలాన్ని దానమిచ్చి దశాబ్దాలు గడచినా, దానికి రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంతో రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించారు. అప్పట్లో ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి సాయిబాబా.. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కేవలం హెచ్చరిక బోర్డులకే నగరపాలక సంస్థ చర్యలు పరిమితమయ్యాయి. స్థలాన్ని రక్షించేందుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.. ఏళ్లు గడుస్తున్నా నగరపాలక సంస్థ వ్యవహారంలో ఏమాత్రం మార్పు లేకపోవడం, స్థలానికి కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మళ్లీ అది కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేతులు కాలాక..!

దాతల ఆశయాలను నెరవేర్చడంలో, నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను సంరక్షించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందని నగర ప్రజలు మండిపడుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకునే చందంగా.. నగరపాలక సంస్థకు చెందిన స్థలం కబ్జాకు గురైన తర్వాత చర్యలు చేపట్టే కన్నా, ముందుగానే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే శ్రేయస్కరమని అంటున్నారు. దీనివల్ల కబ్జా చేసేందుకు ఆస్కారం ఉండదని భావిస్తున్నారు ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి కార్పొరేషన్ స్థలాలకు రక్షణ చర్యలు చేపట్టాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ ఆదేశాలు ప్రజలకేనా..!

వర్షాలు కురుస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలు తొలగించాలంటూ కమిషనర్ దినేష్‌కుమార్ ఇచ్చిన ఆదేశాలు కేవలం నగర ప్రజలకేనా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నగరపాలక సంస్థకు చెందిన స్థలంలో తుప్పలు విపరీతంగా పెరిగినా, వాటిని తొలగించే చర్యలపై కార్పొరేషన్ యంత్రాంగం దృష్టి పెట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలాల్లో తుప్పలు తొలగించడంతో పాటు, వాటికి ఫెన్సింగ్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. నగరపాలక సంస్థ ఖాళీ స్థలం విషయమై సిటీ ప్లానర్ మూర్తిని వివరణ కోరగా, దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రక్షణ చర్యలు చేపడతామన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



"నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాలను కాపాడుకునేందుకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. స్థలాలు కబ్జాకు గురికాకముందే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే రక్షణగా ఉంటుంది. నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి. దాతల ఆశయాలను గౌరవించి, ప్రజోపయోగ కార్యక్రమాలకు వాటిని కేటాయించాలి."

– కర్రి లక్ష్మీనరసింహారెడ్డి, విశ్రాంత ఉద్యోగి, రాజమహేంద్రవరం

అన్యాక్రాంతం కాకుండా చూడాలి



"ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా నగరపాలక సంస్థ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములకు రక్షణ చర్యలు చేపట్టకపోతే కబ్జాకు గురయ్యే అవకాశం ఉంది. కోట్లాది రూపాయల విలువైన స్థలాలపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. వాటిని సంరక్షించి, అభివృద్ధి చర్యలు చేపట్టాలి."

– సబ్బారపు సూర్యనారాయణ, లలితానగర్, రాజమహేంద్రవరం

అంబరాన్ని తాకేలా..

వైభవంగా గురజాల అక్కమ్మ తల్లి జాతర


బళ్లపై దేవతా వేషధారణలు

రాజమహేంద్రవరం రూరల్: కాటిలైటిసిటీ గ్రామంలో ఉన్న గ్రామ దేవత గురజాల అక్కమ్మతల్లి 33వ జాతర మహోత్సవాలు ఆదివారం సాయంత్రం నుంచి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, నైవేద్యం సమర్పించారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, ఇతర నేతలు అమ్మవారిని దర్శించుకోగా, కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి చల్లఘటం ఊరేగింపు రాజీవ్ గృహకల్ప సముదాయం నుంచి భారీ బాణసంచా, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బళ్లపై వేషధారణలు, ఆటపాటలతో అంగరంగ వైభవంగా బయలుదేరింది. రాత్రి 8 గంటల సమయంలో బస్టాండ్ సెంటర్‌లో అక్కమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకోగా, అమ్మవారి వద్ద చల్లఘటాన్ని పెట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు వేలాదిగా తరలి వచ్చి జాతరను తిలకించారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు తూర్పు మండల డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఉమర్, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.


జాతర మహోత్సవంలో చల్లఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు


గురజాల అక్కమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల


మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పులు

గోదావరీ



బొబ్బిల్లంక-ములకల్లంక మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

సీతానగరం: అఖండ గోదావరి వరద మరింత ఉద్రిక్త రూపం దాల్చుతోంది. ఆదివారం బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య గోదావరి వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సాయిబాబా, మండల ప్రత్యేకాధికారి రామ్‌ప్రసాద్, ఈఓపీఆర్డీ మూర్తి, ఆర్ఐ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య కలిసి బొబ్బిల్లంక రేవు వద్దకు చేరుకుని, గోదావరి వరదను పరిశీలించారు. వరద మరింత ఉధృతమైతే బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ములకల్లంకలో పారిశుధ్యంపై అధికారులు ఆరా తీశారు. అదే విధంగా తాగునీటి సమస్య ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని, అలాగే పంచాయతీ అందించే నీటిని క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ములకల్లంక, బొబ్బిల్లంకల్లో 24 గంటలు వైద్యశిబిరం నిర్వహించాలని ఆదేశించారు. వైద్య శిబిరాల్లో కుక్క, పాము కాటు వ్యాక్సిన్లు, ఇతర మందులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ములకల్లంక వాసులను అక్కడ నుంచి తరలించడానికి ప్రయత్నించినా, వారు అంగీకరించడం లేదన్నారు. గోదావరి వరద మరింత ఉధృతమైతే వారిని అక్కడ నుంచి తరలిస్తామని తెలిపారు. అలాగే పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకుని, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నామని వారు చెప్పారు.

పెదపూడి: అల్పపీడనం కారణంగా ఇటీవల ఏకధాటిగా వర్షం కురవడం, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో మండలంలోని అనేక గ్రామాల్లో వరి పొలాలు ఇంకా నీటి ముంపులోనే ఉండిపోయాయి. మండలంలో సంపర, కాండ్రేగుల, చింతపల్లి, దోమాడ, కరకుదురు, ఏపీత్రయం, గంగ్రేడు, పెదపూడి తదితర గ్రామాల్లో సుమారు 650 ఎకరాల్లో వరి నాట్లు నీటి ముంపునకు గురయ్యాయి.

శాకంబరి దేవి.. శరణు శరణు


శాకంబరిదేవి అలంకరణలో కన్నమ్మ పేరంటాలు అమ్మవారు


మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో పార్వతీమాత

సీటీఆర్ఐ: గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో పార్వతీమాతను శాకంబరి దేవిగా ఆదివారం అలంకరించారు. సొరకాయలు, దొండ, బెండకాయలు, కరివేపాకు, నిమ్మకాయలతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

కన్నమ్మ పేరంటాలు ఆలయంలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోట రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న కన్నమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం గురు పౌర్ణమి కావడంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అమ్మవారిని, ఆలయాన్ని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి, స్థానిక పెద్దలు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ మీసాల నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు


వెంకటనగరం సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న పూజలు


కడియంలో సాయిసత్య వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


దుళ్లలో సాయి పల్లకీ ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం మెయిన్ రోడ్డులోని వెంకట సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకడ హారతి, పంచామృతాలతో అభిషేకం, అఖండ దీపారాధన, నీరాజన మంత్ర పుష్పం, హారతి, భక్త బృందంతో గీత పారాయణం, వెంకటనగరం భక్త బృందంతో భజన నిర్వహించారు. ప్రధాన అర్చకుడు సదా శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవమూర్తికి పంచామృతాలతో భక్తులు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది. మండలంలోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధనలు నిర్వహించారు.

గోషాడ గోసాయి మఠంలో..

రాజమహేంద్రవరం సిటీ: గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక పుష్కరాల రేవులోని గోషాడ గోసాయి మఠంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ బోండాడ దుర్గారాజేంద్రప్రసాద్ సిద్ధాంతి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ తారకేశ్వరరావు, అర్చకులు ఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కడియం: గురు పౌర్ణిమ సందర్భంగా మండలంలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి సత్యవ్రతాలు, సాయినామ సంకీర్తనలు జరిగాయి. కడియం బస్టాండు సమీపంలోని సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కడియపులంక, వేమగిరి, మురమండ గ్రామాల్లోని సాయి ఆలయాల్లో ప్రత్యక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. మురమండలో అన్నదానం చేశారు. దుళ్లలోని షిర్డీ సాయి ఆలయంలో ఉదయం సాయిసత్య వ్రతాలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భక్తులు ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు.


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గురు పౌర్ణమి వేడుకలు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలి

ప్రకాశం నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను నాశనం చేసే విధానాలను అవలంబిస్తున్నాయని, ఈ చర్యలను మానుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా ప్లీనరీ సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి అశోక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో విద్యార్థుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కొనసాగించాలని కోరారు. అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వై.భాస్కర్, ఎస్.రాజా, సహాయ కార్యదర్శిగా కె.జ్యోతిర్మయి, ఉపాధ్యక్షులుగా వాసు, కనక, సభ్యులుగా సురేష్, సాహితి, ముఖీల, నాగచైతన్య, నాని, కార్తీక్, దుర్గ క్రాంతి ఎన్నికయ్యారు.

క్రిస్టియన్ మైనార్టీ ప్రొటెక్షన్ సెల్ జిల్లా డైరెక్టర్‌గా పాల్


పత్రాన్ని అందుకుంటున్న క్రిస్టియన్ పాల్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): క్రిస్టియన్ మైనార్టీ ప్రొటెక్షన్ సెల్ తూర్పుగోదావరి జిల్లా డైరెక్టర్‌గా బిషప్ డాక్టర్ బళ్లా క్రిస్టియన్ పాల్ నియమితులయ్యారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడతూ 32 ఏళ్ల నుంచి యాక్షన్ ఫర్ పూర్, నీడీ సొసైటీ ద్వారా పేద ప్రజలకు, వితంతువులకు, పేద బాల,బాలికలకు, కుష్టు రోగులకు, పేద సువార్తికులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తన సేవలను గుర్తించి ఈ పదవిలో నియమించిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని పెదవాడపల్లి, కొవ్వూరు, ర్యాలీ, ఏజెన్సీ ప్రాంతాలలో సేవా కార్యక్రమలు కొనసాగిస్తున్నానన్నారు. ఆయనకు తూర్పుగోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, సంఘ కాపరులు అభినందనలు తెలిపారు.

యువతి అదృశ్యం


నాగప్రపూర్ణ (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె కనిపించడం లేదని రాజమహేంద్రవరం మల్లయ్యపేటకు చెందిన దేవు గౌరీనాథ్ ఆదివారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, ఆదివారం సాయంత్రం 19 ఏళ్ల దేవు పల్లవి నాగప్రపూర్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినప్పటికీగామె తిరిగి రాలేదు. ఈ మేరకు గౌరీనాథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కడియం: సీజనల్ వ్యాధులపై స్థానిక షిర్డీసాయి విద్యా నికేతన్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పలు గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించారు. అంటు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నారులే ప్రజలకు అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పెదపూడి: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని మండల విద్యాశాఖాధికారి–2 సీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకూ శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలన్నారు.

సినిమాలు



శ్యామల	భారతీయుడు–2
సూర్యమినీ	బ్యాడ్ న్యూస్
సూర్యప్యాలెస్	భారతీయుడు–2
స్వామి	ట్విస్టర్స్
అశోక	కల్కి 2898ఏడి
శివజ్యోతి	పేక మేడలు
అనుశ్రీ	డార్లింగ్
రంభ	క్రైమ్ రియల్
ఊర్వశి	డీమోంటీ కాలనీ
కుమారి	నరబలి
అప్సర నామవరం	కల్కి 2898ఏడి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	డార్లింగ్
మురళీకృష్ణ కడియం	కల్కి 2898ఏడి
వెంకటసూర్య	డార్లింగ్